క్లుప్తంగా

తాగి వాహనాలు నడిపిన నలుగురిపై కేసు

సారంగపూర్: మండలంలోని నిర్మల్–స్వర్ణ రహదారిపై మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలిచ్చినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎన్నికల వేళ బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

పేదకుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న రాజేశ్వర్ మిత్రులు

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్‌లో పేదకుటుంబానికి చెందిన నిమ్మల లక్ష్మి కూతురు రిషిక వివాహం ఇటీవల కాగా.. అయిన ఖర్చులకు ఆదివారం పలువురు ఎన్‌ఆర్‌ఐలు రూ.50వేలు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఇజ్రాయెల్ దేశంలో ఉంటున్న ఖానాపూర్‌కు చెందిన గొల్లవత్తుల రాజేశ్వర్ తన అక్కడి ఎన్‌ఆర్‌ఐ మిత్రులతో కలిసి రూ.50వేలు పోగు చేశారు. వాటిని ఖానాపూర్‌లో ఉన్న తన మిత్రులకు పంపి లక్ష్మి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో కట్టికోల నర్సయ్య, గడ్‌దాస్ రవిచరణ్, పెండెపు నర్సయ్య, చిప్ప దేవన్న, వేముల నాగరాజు, మహేశ్, కొక్కుల నాగరాజు, సునీల్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శేఖర్‌గౌడ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



సారంగాపూర్‌లో తనిఖీ చేపడుతున్న ఎస్సై

నిర్మల్: సారంగపూర్‌తోపాటు సిర్పెల్లి, చించోలి(బి) చెక్‌పోస్టులు, పోలీస్‌స్టేషన్, ఆయా గ్రామాల్లో ఉన్న ప్రధాన రహదారులపై పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. స్థానిక ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, డబ్బు జిల్లాలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. చించోలి(బి) చెక్‌పోస్టు సహా అంతర్రాష్ట్ర రహదారి అయిన సిర్పెల్లిలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీలు కట్టుదిట్టం చేసే దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమంలో ఏఎస్సై వసంత్, సిబ్బంది ఉన్నారు.

వృద్ధురాలికి చేయూత

లక్ష్మణచాంద: మండలంలోని పీచరలో ఎవరూ లేని సాయవ్వ అనే వృద్ధురాలికి అదే గ్రామానికి చెందిన గోపి అనే యువ కళాకారుడు చేయూతనిచ్చాడు. హోలీ పండుగ నేపథ్యంలో గుడిసెలో ఉంటున్న ఆ వృద్ధురాలి వద్దకు వెళ్లిన యువకుడు నూతన చీర, నెల రోజులకు సరిపడ సరుకులు అందించాడు. అనంతరం వృద్ధురాలితో కేక్ కట్ చేయించి పండుగ వాతావరణం కల్పించారు. దీంతో వృద్ధురాలు సంతోషపడింది.

'మట్టల ఆదివారం'



ఊరేగింపులో క్రిస్టియన్లు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని సీ ఐ ఎ స్‌ఐ చర్చిలో మట్టల ఆదివారం నిర్వహించారు. గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం సందర్భంగా లక్ష్మణచాందలో క్రిస్టియన్ సంఘం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రాజ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి పంచామృతాభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, సారంగపూర్, ఎలగడప గ్రామాల సమీపంలోగల శ్రీ అక్కకొండ లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం పంచామృతాభిషేకం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. పౌర్ణమి ఉత్తర ఫాల్గుణ నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

అటకెక్కిన ఆహ్లాదం..!



పిచ్చిమొక్కల నడుమ జిమ్ పరికరాలు

- మూణ్నాళ్ల ముచ్చటగా కల్లూర్ రూర్బన్‌పార్క్
- అలంకారప్రాయంగా ఫౌంటేన్
- మూలనపడుతున్న జిమ్ పరికరాలు



విరిగిపోయిన ఫౌంటేన్



పనిచేయని హైమాస్ట్ లైట్, ఎండిపోయిన గడ్డి

కుంటాల: గ్రామీణ ప్రాంతాల్లో పట్టణస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రూర్బన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఆహ్లాదం పంచేందుకు కుంటాల మండలం కల్లూర్‌లో అన్ని హంగులతో రూ.60 లక్షలతో పార్క్ (ఉద్యానవనం) నిర్మాణం చేపట్టారు. ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచేందుకు కల్లూరు సాయిబాబా ఆలయ ఆవరణలో ఉద్యానవనం ఏర్పాటు చేశారు. నిర్మల్ నుంచి బాసర, షిర్డీ, మహారాష్ట్ర నుంచి వేములవాడ, ధర్మపురి, కొండగట్టు, భద్రాచలం వెళ్లే భక్తులు ఈ పార్క్ లో సేద తీరేందుకు వసతులు కల్పించారు. కానీ ఈ పార్కు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారింది. అధికారులు స్పందించి పార్కులో సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.60 లక్షలతో ఏర్పాటు..

ప్రశాంత వాతావరణం.. ఆహ్లాదం పంచేందుకు మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయ ఆవరణలో 2021 జూలైలో రూ.60 లక్షలతో రూర్బన్ పార్కు పథకం కింద పార్కు ఏర్పాటు చేశారు. రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కులో 940 మొక్కలు నాటి 450 మీటర్ల వాకింగ్ ట్రాక్ నిర్మించారు. కానీ నిర్వహణ మూణ్నాళ్ల ముచ్చటగా మారి పార్కు అధ్వానంగా తయారైంది.

సౌకర్యాలు కల్పించాలి



రూర్బన్ పథకం కింద కల్లూర్‌లో నిర్మించిన పార్క్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలి. నిర్వహణ లేక సందర్శకులు ఎవరూ రావడం లేదు. గతంలో సౌకర్యాలున్నప్పుడు పార్కుకు ఎక్కువ మంది వచ్చేవారు. ప్రస్తుతం పార్కు కల తప్పింది. – ఆలూరి ప్రశాంత్, కల్లూర్

ఆహ్లాదాన్ని పంచేలా చర్యలు



ఆధ్యాత్మిక వాతావరణంలో రూర్బన్ పథకం కింద రూ.60 లక్షలతో పార్కును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సమగ్ర అభివృద్ధిలో భాగంగా నిర్మించిన ఈ పార్కును పరిశీలిస్తాం. సౌకర్యాలు కల్పించి సందర్శకులకు ఆహ్లాదం పంచేలా చర్యలు తీసుకుంటాం. – అబ్దుల్ రహీం, ఎంపీడీవో

రాజస్థాన్ నుంచి తీసుకొచ్చిన ఫౌంటేన్ విరిగిపోయింది. ప్రత్యేక ఆకర్షణ కోసం ఏకశిలపై వేయించిన జంతువులు, పక్షుల బొమ్మలు కళతప్పి పగుళ్లు తేలాయి. మహిళలు, పిల్లలు, యువకులు వ్యాయామం చేసేందుకు ఏర్పాటు చేసిన 18 జిమ్ పరికరాలు విరిగి మూలన పడ్డాయి.

120 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన కూలర్‌లో నీరు లేక కళావిహీనంగా మారింది. హైమాస్ట్ లైట్ పని చేయక పార్క్ చీకట్లతో కనిపిస్తోంది.

నిర్వహణలోకి తీసుకురావాలి

కల్లూర్‌లో ఉన్న సాయిబాబా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రయాణికులు, భక్తులు, పర్యాటకులు ఈ పార్కులో సేదతీరేవారు. కానీ నిర్వహణ సరిగా లేక ఈ పార్కుకు ఎవరూ రావడం లేదు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పిస్తే పార్కుకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుంది.

బదిలీ, పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కడెం: గతంలో ప్రారంభమైన ఉపాధ్యాయ, ఉద్యోగ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేశ్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భిక్షపతినాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, బలరాం, సందీప్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



కవాతులో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, బలగాలు

భైంసాటౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అందరూ నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ రాజా రెడ్డి, ఎస్సైలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

గ్రామాల్లో కాముని దహనం



నిర్మల్‌లోని ప్రియదర్శినినగర్‌లో..



భైంసాలోని భవానీచౌక్‌లో కామదహనం

నిర్మల్‌టౌన్: హోలీ పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి ఘనంగా కామదహనాన్ని నిర్వహించారు. స్థానిక బుధవార్‌పేట్ అనుముల కాముడు, గాంధీచౌక్, బంగల్‌పేట్, ఈద్గాం, బాలాజీవాడ, వెంకటాదిపేట్, చింతకుంటవాడ, గాయత్రి టౌన్‌షిప్, మంజులాపూర్, దివ్యనగర్, చైన్‌గేట్, బాగులవాడ, నాయుడువాడ, ఇంద్రనగర్, భాగ్యనగర్, ప్రియదర్శినినగర్ తదితర కాలనీల్లో కామదహనం చేశారు. అంతకుముందు డప్పుచప్పుళ్ల మధ్య ఇండ్లలోని పాత వస్తువులను తెచ్చి కూడళ్లలో పేర్చి, పిడకలు వేసి పూజలు చేశారు. తర్వాత కాముని చుట్టూ తిరుగుతూ బూడిదను బొట్టుగా పెట్టుకున్నారు. అందులో కుడుకలు, శనగలు కాల్చుకుని ప్రసాదంగా స్వీకరించారు. ఇళ్లకూ తీసుకెళ్లారు. సోమవారం హోలీ నిర్వహించుకునేందుకు పట్టణవాసులంతా సిద్ధమయ్యారు.

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం కాముడి దహనం ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ఒకరోజు ముందు కామదహనం చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పట్టణంలోని భవానీచౌక్‌తోపాటు పలు కాలనీల్లో కూడళ్ల వద్ద పూజలు చేసి కామదహనం చేశారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, అందాకూర్, ఓలా, అంబకంటి, లింబా(కే) తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి కామ దహనం నిర్వహించారు. కుంటాలలో విఠల్ పటేల్, నారాయణ పటేల్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కాముడికి చక్కెర, కుడుకల పేర్లు, నైవేద్యం సమర్పించి వేడుకలు నిర్వహించారు. ఎస్సై వి.రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తానూరు: మండలంలోని గ్రామాల్లో ఆదివారం కాముడి దహనం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కట్టెలను పేర్చి పూజలనంతరం దహనం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని గ్రామాల్లో కాముడి దహనం నిర్వహించారు. సంధ్యాకాలం ఇంటింటా మంగళహారతులు, దొంతులను చేతబూని దహన ప్రదేశాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

కుభీర్: మండల కేంద్రంలో విఠలేశ్వరం మందిరం వద్ద కాముడి దహనం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెంటాజీ పూజలు చేశారు. కుభీర్‌లోని చాణక్య సంస్కృతీ పాఠశాలలో హోలీ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కామదహనం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముధోల్: మండలవ్యాప్తంగా కాముడి దహనం నిర్వహించారు. నిండు కుండలతో కాముడి చుట్టు తిరుగుతూ ప్రదక్షిణలు చేశారు.



కుభీర్‌లోని ఓ పాఠశాలలో..



కుభీర్‌లో విఠలేశ్వర ఆలయం వద్ద పూజలు



తానూరులో..

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ శివారులో శ్రీలక్ష్మీనారాయణ స్వామి సహిత రాజ్యలక్ష్మీ వేడుకలు ముగిశాయి. ఆదివారం వేద పండితులు సంతోష్ జోషి ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిపించారు. భక్తులు మధురిక, సహస్రాలను బెల్లంతో తూకంవేసి మొక్కులు తీర్చుకున్నారు. భైంసాకు చెందిన మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్, కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, గంగన్న, సాయన్న, శంకర్‌గౌడ్, సాయారెడ్డి ఉన్నారు.

చిన్నారికి నాట్యరత్న పురస్కారం



పురస్కారంతో శాన్విమాల్వే

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రానికి చెందిన చిన్నారి శాన్వి మాల్వే కూచిపూడి నృత్య ప్రదర్శనలో నాట్యరత్న పురస్కారం అందుకుంది. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన నాట్య ప్రదర్శనలో శాన్వి ప్రతిభ కనబర్చింది. 'కూచిపూడి నాట్యరత్న–2024'పురస్కారం, ప్రశంసపత్రాన్ని ఆమెకు అందించారు. చిన్నారి పురస్కారం అందుకోవడంపై వైద్య దంపతులైన తల్లిదండ్రులు శృతి–చంద్రప్రకాశ్ మాల్వే, గురువు ఏలేటి అంజలిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శాన్వి మాల్వే ప్రస్తుతం యూకేజీ చదువుతోంది.

ప్రజలు ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



ప్రవచనాలు చెబుతున్న రెడ్డి మహరాజ్

కుంటాల: ప్రజలు చెడు వ్యసనాలకు దూరం ఉండి ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని మహారాష్ట్రలోని చిక్లికి చెందిన రెడ్డిమహరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని కుంటాలలోని ప్రాచీన శ్రీకృష్ణ ఆలయంలో భక్తులకు పలు ప్రవచనాలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

తానూరు: ప్రతి ఒక్కరూ భగవంతుడిని స్మరిస్తూ భక్తి భక్తి మార్గంలో నడవాలని మావలి మహరాజ్ నాందేడ్‌కర్ సూచించారు. శనివారం రాత్రి మండలంలోని మొగ్లి గ్రామంలో నిర్వహించిన కీర్తనలో పాల్గొని భక్తులకు ప్రవచనాలు బోధించారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దన్నారు. తులసీమాల ధరించి మద్యం, మాంసానికి దూరంగా ఉండాలన్నారు. వార్‌కరి భక్తులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు



ఖానాపూర్‌లో ఎస్సైకి స్వీట్ తినిపిస్తున్న చైర్మన్



కుంటాల: కల్లూర్ కస్తూరిబాలో..



కడెం: లింగాపూర్‌లో గ్రామస్తులు

ఖానాపూర్: పట్టణంలో ఆదివారం కనుల పండువగా ముందస్తు హోలీ వేడుకలు జరుపుకొన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వీధుల్లోకి వచ్చి సంబురాలు చేసుకున్నారు. హిందూ ఉత్సవసమితి, ఖానాపూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో రంగులబండితో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ.. డ్యాన్సులు చేస్తూ.. స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, కావలి సంతోష్, తొంటి శ్రీనివాస్, కిశోర్‌నాయక్, నాయిని సంతోష్, పడాల రాజశేఖర్, కాశవేని ప్రణయ్, బండారి కిశోర్, బీసీ రమేశ్, అశోక్‌రెడ్డి, గంగన్న, కిషన్, శ్రీనివాస్, నరేందర్, పవన్, బాలాజీ, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్: సారంగపూర్ మండలంలోని కౌట్ల(బి), ధని, ఆలూరు, బీరవెల్లి, మలక్‌చించోలి, చించోలి(బి) గ్రామాల్లో ముందస్తు హోలీ వేడుకలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు సంబరాల్లో పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ, బామ్నికే, హథ్‌గాం, పిప్రి తదితర గ్రామాల్లో ముందస్తు హోలీ పండుగ జరుపుకొన్నారు. వీధుల్లో డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ కస్తూరిబాలో ఆదివారం విద్యార్థులు ఉత్సాహంగా ముందస్తు హోలీ వేడుకలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో సువర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్, ఎలగడప గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించారు.

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. చిన్నారుల కేరింతలతో వీధులు సందడిగా మారాయి. పౌర్ణమి ఘడియలు సోమవారం మధ్యాహ్నం ప్రారంభమై మంగళవారం వరకు ఉండడంతో కొందరు ఆదివారం వేడుకలు నిర్వహించుకున్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా రంగుల బండితో వెళ్తూ సంబరాలు చేసుకున్నారు. వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: హోలీ ఆడుతున్న కాంగ్రెస్ నేతలు



జిల్లాకేంద్రంలో మిత్రబృందం

స్వామిజీ జయంతి



విగ్రహానికి పూజలు చేస్తున్న వివిధ ప్రాంతాల స్వామిజీలు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ బ్రహ్మేశ్వరాలయం వద్ద సత్యానంద సరస్వతి స్వామిజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్జయిని స్వామిజీ ఆనంద సరస్వతి, హోండా నాగనాథ్ మహారాష్ట్ర ఒడిశా బాబా, కందకూర్తి హరిదాస్ స్వామిజీ, మెట్‌పల్లి లక్ష్మణస్వామిజీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కూలర్ల వితరణ

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ ఆలయ హనుమాన్ భక్తులకు నిజామాబాద్ జిల్లా నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నందగిరి అన్వేశ్‌కుమార్ ఆదివారం రూ.ఆరు వేల విలువైన రెండు కూలర్లను వితరణ చేశారు. అన్నదానం చేశారు.గురుస్వామి భుజంగం గణపతి, స్వాములు నవీన్‌కుమార్, రామ్‌చందర్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, పీరాజీ, పిస శ్రీనివాస్, బోగ చిన్నయ్య, బొంతల సంజీవ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్ర ంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలో హోలీ పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వామి మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. పంచామృతాభిషేకాలు, వస్త్రాలంకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.